



డీఎంకే నేత, ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న ఆ పార్టీ అభ్యర్థులు ఎస్ఆర్ శివలింగం - పి.విల్సన్ - అభ్యర్థి సల్మా

రాజ్యసభ ఎన్నికల కోలాహలం..

అట్టహాసంగా డీఎంకే, అన్నాడీఎంకే

అభ్యర్థుల నామినేషన్

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీ అయ్యే ఆరు రాజ్యసభ స్థానాలకు పోటీ చేయనున్న నలుగురు డీఎంకే కూటమి అభ్యర్థులు, ఇద్దరు అన్నాడీఎంకే అభ్యర్థులు శుక్రవారం ఉదయం నామినేషన్లు వేశారు. సిట్టింగ్ రాజ్యసభ సభ్యులైన వైగో, డాక్టర్ అన్బుమణి సహా ఆరుగురి పదవీకాలం ఈ నెల 24తో ముగియనుండటంతో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 19న జరుగనున్న ఈ ఎన్నికల్లో డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్, కవయిత్రి సల్మా, ఎస్ఆర్ శివలింగం, ఆ పార్టీ మిత్రపక్షమైన ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్ పోటీ చేయనున్న విషయం విదితమే. ఇదే విధంగా అన్నాడీఎంకే తరఫున న్యాయవాది ఇన్బదురై, తిరుప్పోరూరు మాజీ ఎమ్మెల్యే ధనపాల్ పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. తొలుత డీఎంకే అభ్యర్థులు ముగ్గురూ సచివాలయంలో కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా రాజ్యసభ ఎన్నికల నిర్వహణాధికారిగా నియమితులైన శాసనసభ అదనపు కార్యదర్శి సుబ్రమణియన్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఎంపీలు టీఆర్ బాలు, కనిమొళి, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, మంత్రులు ఏవీ వేలు, సేలం రాజేంద్రన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే విధంగా సీఎం, డిప్యూటీ సీఎం సమక్షంలో ఎంఎన్ఎంనేత, ప్రముఖ సినీ నటుడు కమల్‌హాసన్ నామినేషన్ దాఖలు చేశారు.

అన్నాడీఎంకే అభ్యర్థులు..

అన్నాడీఎంకే తరఫున పోటీ చేస్తున్న న్యాయవాది ఇన్బదురై, తిరుప్పోరూరు మాజీ ఎమ్మెల్యేల ధనపాల్ కూడా నామినేషన్లు వేశారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), మాజీ మంత్రులు పొన్నయన్, కేపీ మునుసామి, సెంగోటయ్యన్, నత్తం విశ్వనాథన్, పి.తంగమణి, అన్బళగన్, డి.జయకుమార్, ఎస్పీ వేలుమణి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఈపీఎస్ ఇద్దరు అభ్యర్థులను సత్కరించారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థికి పది మంది శాసనసభ్యులు మద్దతిస్తూ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. డీఎంకే, అన్నాడీఎంకే తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఎంఎన్ఎం అభ్యర్థి కమల్‌హాసన్‌కు పదిమందికిపైగా శాసనసభ్యులు మద్దతు ప్రకటిస్తూ సంతకాలు చేశారు. ఈ పరిస్థితులలో నామినేషన్లు వేసిన ఇద్దరు ఇండిపెండెంట్లు నామినేషన్లలో ఎమ్మెల్యేలు ఎవరూ మద్దతు ప్రకటించి సంతకాలు చేయకపోవడంతో వారి నామినేషన్లను పరిశీలనలోనే ఎన్నికల నిర్వహణాధికారి సుబ్రమణియన్ తోసిపుచ్చనున్నారు. ఈ ఎన్నికల్లో సరిపడే శాసనసభ్యుల మద్దతుతో ఆరుగురు అభ్యర్థులు మాత్రమే పోటీ చేస్తుండటంతో వీరంతా ఏకగ్రీవంగా ఎన్నికవడం ఖాయమైంది. ఈ నెల 12న ఎన్నికల నిర్వహణాధికారి అధికారికంగా ప్రకటన జారీ చేయనున్నారు.



అన్నాడీఎంకే నేత ఈపీఎస్ సమక్షంలో నామినేషన్ వేస్తున్న ఆ పార్టీ అభ్యర్థులు ధనపాల్ - ఇన్బదురై

సోషల్ మీడియాలో యూనిఫాంతో భేటీలు,

ఫొటోలు వద్దు

● ఉన్నతాధికారులకు డీజీపీ ఆదేశం



డీజీపీ శంకర్ జివాల్

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసుశాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు కార్యాలయాలకు సంబంధించిన వ్యవహారాల గురించి, కీలకమైన దర్యాప్తు వివరాలు తెలిపే ప్రకటనలలో యూనిఫాంతో ఉన్న ఫొటోలను అప్‌లోడ్ చేయకూడదని, అదే విధంగా సోషల్ మీడియాలో ఇంటర్వ్యూలు కూడా ఇవ్వకూడదని డీజీపీ శంకర్‌జివాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలి కాలంలో ప్రైవేటు కార్యక్రమాలకు యూనిఫాంతో వెళ్లే పోలీసు ఉన్నతాధికారులు తమ జోన్ పరిధిలో వివిధ కేసులపై జరుగుతున్న దర్యాప్తు వివరాలను ప్రకటిస్తున్నారని తమకు పలు వర్గాల నుండి ఫిర్యాదులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. యూట్యూబ్‌లో ఇంటర్వ్యూలు ఇస్తూ కేసుల దర్యాప్తునకు సంబంధించి కీలకమైన వివరాలను కూడా వెల్లడిస్తున్నట్లు తనకు తెలియవచ్చిందన్నారు. ఇకపై పోలీసు ఉన్నతాధికారులు యూట్యూబ్ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇవ్వదలిస్తే ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని కూడా శంకర్‌జివాల్ తెలిపారు. అవసరమైతే పోలీసు ఉన్నతాధికారులు తాము పాల్గొనబోయే కార్యక్రమాల వివరాలు, ఆ కార్యక్రమాలలో తాము ప్రసంగించదలచిన వివరాలు ఉన్నతాధికారులకు ముందుగా తెలిపితే మరీ మంచిదన్నారు. ఇకపై సోషల్ మీడియాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ యూనిఫామ్‌తో ఉన్న ఫొటోలు పంపకూడదని, పై అధికారుల అనుమతి తీసుకున్న తర్వాతే ఇంటర్వ్యూలు ఇవ్వాలని ఆయన సూచించారు.

రెండో వారంలో విజయ్ ప్రజాయాత్ర

● 42 రోజులకు ప్లాన్



అడయార్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, సినీ హీరో విజయ్ ప్రజల చెంతకు వెళ్ళాలని నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. మొత్తం 42 రోజుల పాటు ప్రజల్లో తిరగాలని ఆయన భావిస్తున్నారు. స్టార్ హీరోగా ఉన్న విజయ్ క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అప్పటి నుంచి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే యేడాది శాసనసభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రజల దగ్గరకు వెళ్ళాలని ఆయన భావిస్తున్నారు. ఈ ప్రయాణం కూడా ఏకంగా 42 రోజుల పాటు సాగేలా ఆయన ప్రణాళిక రూపొందించుకున్నట్టు సమాచారం. జూన్ రెండో వారం లేదా ఆగస్టు మొదటి వారంలో దీన్ని ప్రారంభించాలని ఆయన ఆలోచన చేస్తున్నారు ఈ ప్రయాణాన్ని తిరుచ్చి లేదా మదురై నుంచి ప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇందుకోసం ఆయన ప్రత్యేకంగా ఒక ప్రచార రథాన్ని కూడా సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ పర్యటనపై జిల్లా కార్యదర్శుల అభిప్రాయాన్ని ఆయన సేకరిస్తున్నట్టు వినికిడి. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీ నేతల్లో ఏదైనా మనస్పర్థలున్నాయా? లేదా? అనే విషయంపైనా ఆరా తీసి, ఈ గొడవలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆయన అంతర్గతంగా ఆదేశించినట్టు వెల్లడించారు. 2026లో అనుకున్న లక్ష్యం కోసం ప్రతి ఒక్కరూ ముందుకుసాగాలని ఆయన పార్టీ నేతలకు హితవు పలికారు. అదేసమయంలో విపక్ష నేతలు చేసే విమర్శలకు కౌంటర్ ఇస్తూ, సమయాన్ని వృధా చేసుకోరాదని, మనకు లక్ష్యమే ముఖ్యమని విజయ్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కె.శంకర్

డ్రగ్స్ నిర్మూలనలో

విద్యార్థుల పాత్ర కీలకం

● పోలీస్ కమిషనర్ శంకర్

అడయార్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల నిర్మూలనలో విద్యార్థుల పాత్ర ముఖ్యమని నగర పోలీస్ కమిషనర్ కె.శంకర్ అన్నారు. పట్టాభిరామ్‌లోని డీఆర్‌బీసీసీ హిందూ కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ కె.శంకర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన అంశాన్ని వివరించారు. గతంలో కాలేజీల్లో చేరే విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో వేధించేవారని ఇపుడు పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ర్యాగింగ్ పేరుతో కొత్తగా చేరే విద్యార్థులనే వేధింపులకు గురిచేస్తే కఠిన శిక్షలకు గురవుతారన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో కంటే కాలేజీల్లోనే పూర్తి స్వేచ్ఛను అనుభవిస్తారని, దాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలన్నారు. సోషల్ మీడియా సమయాన్ని వృధా చేస్తుందని, అందువల్ల సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకునేందుకు ఉపయోగించుకోవాలన్నారు. ఇపుడు విద్యార్థులకు డ్రగ్స్ ఒక వ్యసనంలా మారిందన్నారు. ఈ డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు ముఖ్య పాత్రను పోషించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎన్. రాజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోరూర్-పూందమల్లి మధ్య మెట్రో ట్రయల్ రన్

విజయవంతం


ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్-పూందమల్లి మధ్య మూడో విడత డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్ విజయవంతమైంది. ఇంతకు ముందు డౌన్ లైన్‌లో 20-25 కి.మీ వేగంతో నిర్వహించిన రెండు విడతల ట్రయల్ రన్ సంతృప్తిగా ఉన్నట్లు సీఎంఆర్ఎల్ భద్రతా విభాగం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో, మూడో విడతగా అదే లైన్‌లో శుక్రవారం 40-50 కి.మీ వేగంతో ట్రయల్ రన్ జరిగింది. పోరూర్-పూందమల్లి మధ్య 9.5 కి.మీ మేర జరిగిన ఈ ట్రయల్ రన్‌లో సీఎంఆర్ఎల్ అధికారులు పాల్గొన్నారు. పోరూర్-పూందమల్లి, పోరూర్-పవర్ హౌస్, ఆలపాక్కం-నందంబాక్కం చెన్నై ట్రేడ్ సెంటర్ మధ్య చేపట్టిన పనులు వచ్చే ఏడాది జూలైలోను, కోడంబాక్కం-పనగల్ పార్క్ మార్గంలో సొరంగం తవ్వకాల పనులు ఆగస్టు నాటికి పూర్తిచేయనున్నట్లు సీఎంఆర్ఎల్ డైరెక్టర్ సిద్ధిక్ తెలిపారు.

నాయన్మార్ ఆలయ కుంభాభిషేకంలో

వెల్లివిరిసిన మతసామరస్యం

● సారె సమర్పించిన ముస్లింలు

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం సమీపం నంబియార్ నగర్ గ్రామంలో శుక్రవారం జరిగిన ఆదిబత్తనాయన్మార్ ఆలయ కుంభాభిషేక వేడుకల్లో ఆ గ్రామానికి చెందిన ముస్లింలు 21 తాంబూలం పాత్రల్లో సారె వస్తువులను ఊరేగింపుగా తీసుకెళ్లి, స్వామివారికి సమర్పించి మతసామరస్యతను ఎలుగెత్తి చాటుకున్నారు. ఆ గ్రామంలో హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు అందరూ ఒకే కుటుంబంలా ఐకమత్యంగా జీవిస్తున్నారు. ఆ గ్రామంలో ఎవరి పండుగ జరిగినా మూడు మతాలకు చెందినవారు తప్పకుండా పాల్గొంటారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం జరిగిన ఆదిబత్త నాయన్మార్ ఆలయ కుంభాభిషేక వేడుకలకు ముస్లింలు ఆ గ్రామంలోని ఏళై పిళ్లయార్ ఆలయం నుంచి పూలుపండ్లు, పట్టు వస్త్రాలు, స్వీట్లు, సుగంధ ద్రవ్యాలతో ఊరేగింపుగా బయలుదేరారు. స్వామివారికి సారెవస్తువులు తీసుకెళుతున్న ముస్లింలకు దారిపొడవునా స్థానికులు, ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆదిబత్త నాయన్మార్ ఆలయంలోకి సారె వస్తువులతో ప్రవేశించిన ముస్లింలకు ఆలయ నిర్వాహకులు, పూజారులు స్వాగతం పలికారు. ఈ విషయమై ముస్లిం నాయకుడు, పారిశ్రామిక వేత్త మీరా హుస్సేన్ మాట్లాడుతూ నాగూర్ దర్గా, వేలాంగన్ని చర్చి, సిక్కల్ సింగారవేలర్ ఆలయం ఇలా మూడు మతాల దేవతామూర్తులు కొలువైన ప్రాంతంగా ఉండటం వల్లే ఈ జిల్లాల్లో మూడు మతాల వారు ఐకమత్యంగా జీవిస్తున్నారని తెలిపారు. ఆలయ వేడుకలకు నిర్వాహకులు ఆహ్వానించడంతో తాము నాయన్మార్‌స్వామికి సారె తీసుకెళ్ళామని చెప్పారు. ఇదే రీతిలోనే తమ గ్రామంలో ముస్లిం పండుగలు, క్రైస్తవుల పండుగలు జరిగినా హిందువులు సారెవస్తువులు సమర్పించడం యేళ్లతరబడి ఆనవాయితీగా ఉంటోందన్నారు.



ఆలయానికి సారెవస్తువులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ముస్లింలు

ఒకేరోజు 136 మంది

సైబర్ నేరస్తుల అరెస్టు

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ద్వారా ఆకట్టుకొనేలా ప్రకటనలు చేసి ప్రజలను నమ్మించి కోట్లాది రూపాయలు వసూలుచేసి మోసం చేస్తున్న సైబర్ నేరస్తుల ఆగడాలు అడ్డుకొనేలా రాష్ట్ర పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం 136 మంది సైబర్ నేరస్తులను అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర సైబర్ క్రైం అడిషినల్ డీజీపీ సందీప్ మిట్టల్ తెలిపారు. 'ఆపరేషన్ తిరైనీకు' అనే పేరుతో గత డిసెంబరులో 76 మంది, రెండవ విడత తనిఖీల్లో 136 మంది నేరస్తులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 125 సెల్‌ఫోన్లు, 35 కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నట్లు అడిషినల్ డీజీపీ తెలిపారు.

బీజేపీ కూటమిలోకి

పీఎంకే, డీఎండీకే

● నయినార్ నాగేంద్రన్



పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కూటమిలో పీఎంకే, డీఎండీకే వస్తాయనే నమ్మకం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగంద్రన్ తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం మదురై ఒత్తకడైలో జరుగనున్న బీజేపీ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... అమిత్ షా శనివారం రాత్రి మదురై చేరుకుంటారని, ఆదివారం మీనాక్షి అమ్మవారిని దర్శించుకుంటారని, అనంతరం రాష్ట్ర నాయకుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. మదురైలో కేంద్ర మంత్రి అమిత్ పాల్గొనే సమావేశంలో కూటమి పార్టీలు పాల్గొనడం లేదన్నారు. అమిత్‌షా-అన్బుమణి భేటీపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. సామరస్యం అనే విషయమై తమకు నమ్మకం ఉందన్నారు. కానీ, రాందాస్-అన్బుమణి మధ్య జరుగుతున్న సామరస్య చర్చలతో తమకెలాంటి సంబంధం లేదన్నారు. దేశంలో మంచి విషయాలు జరగాలని గురుమూర్తి ఆశిస్తున్నారని, ఆయన ఒక మంచి పని కోసం ప్రయత్నిస్తారన్నారు. డీఎంకేకు షా అంటే భయమని, మహారాష్ట్రలో బీజేపీ అధికారం చేపట్టడం వెనుక కేంద్రమంత్రి అమిత్ షా కృషి ఎంతో ఉందని నయినార్ నాగేంద్రన్ గుర్తు చేశారు.

గర్భిణులు మాస్కులు ధరించాలి

● రాష్ట్ర ఆరోగ్య శాఖ సూచన

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లడం తగ్గించాలని, మాస్కు తప్పనిసరిగా ధరించాలని గర్భిణులకు రాష్ట్ర ఆరోగ్య శాఖ సూచించింది. దేశంలో ప్రస్తుతం మళ్లీ కరోనా మహమ్మారి వేగంగా ప్రబలుతోందని, కొవిడ్ బాధితుల సంఖ్య 5,364కు పెరిగిందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. గత 24 గంటల వ్యవధిలో కొవిడ్ బారిన పడి కేరళలో ఇద్దరు, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో తలా ఒకరు మృతిచెందారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను ఆరోగ్య శాఖ చేపట్టింది. కరోనా వైరస్ తాకిడి రాష్ట్రంలో చెప్పుకోదగ్గ స్థాయిలో లేనప్పటికీ, ఆరోగ్య భద్రత దృష్టిలో ఉంచుకొని గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు వీలైనంత వరకు మాస్క్ ధరించాలని ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

త్యాగానికి ప్రతీక బక్రీద్

● ముస్లింలకు నేతల శుభాకాంక్షలు

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రంజాన్ తర్వాత ముస్లింలు జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది బక్రీద్. శనివారం ఈ పండుగ సందర్భంగా ఇచ్చే 'ఖుర్బానీ' ఏర్పాట్లలో వున్న ముస్లింల ప్రత్యేక ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలను సిద్ధం చేశారు. ఇదిలా వుండగా ముస్లింలకు సీఎం స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా పలు పార్టీల నేతలు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశా రు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ జరుపుకోనున్న ముస్లిం సోదరులకు తమ ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించడం, విద్యా రుణాల, హజ్ యాత్రకు సబ్సిడీ తదితరాలు చేపట్టినట్లు సీఎం తన ప్రకటనలో తెలిపారు. మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని, ప్రపంచంలో శాంతి నెలకొని, వనరులు అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ప్రార్థించాలని సీఎం కోరారు. అదే విధంగా, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తదితరులు ముస్లింలకు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలియజేశారు.

సమాచార దృశ్యిని

గ్రూప్-1 హాల్ టిక్కెట్లు విడుదల

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1, 1ఏ పరీక్షల హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) పలు శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి పోటీ పరీక్షలు నిర్వహిస్తుంది. ఆ ప్రకారం, సబ్ కలెక్టర్, డీఎస్పీ సహా 8 రకాల గ్రూప్-1, 1ఏ పోస్టుల భర్తీకి ఈ నెల 15వ తేది ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు tnpscexams.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు నెంబరు, పుట్టిన తేది తదితరాలు నమోదుచేసి హాల్ టిక్కెట్లు పొందవచ్చని టీఎన్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది.

'నెట్'కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జూనియర్ పరిశోధకులు స్కాలర్‌షిప్ కోసం, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేసేందుకు, పీహెచ్‌డీ కోర్సులో చేరేందుకు, సీఎస్ఐఆర్-యూజీసీ 'నెట్' నిర్వహిస్తుంది. జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) ఆన్‌లైన్ ద్వారా జూలై 26,27,28 తేదీల్లో ఈ పరీక్ష నిర్వహించనుంది. ఆసక్తి కలిగిన వారు https://csirnet.nta.ac.in/ అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 23వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

యూట్యూబ్ ఛానల్‌పై శిక్షణ

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూ ట్యూబ్ ఛానల్ ప్రారంభించడంపై శిక్షణ ఇవ్వనున్నారు. యూ ట్యూబ్ ఛానల్ ప్రారంభం, వీడియోలు, స్లైడ్ షోలు అప్‌లోడ్, ప్రకటనలు ఆకర్షించడం సహా పలు అంశాలను శిక్షణలో వివరించనున్నారు. సంస్థ కార్యాలయంలో ఈ నెల 11 నుంచి 13వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. టెన్త్ ఉత్తీర్ణులై 18 ఏళ్లు పూర్తయిన యువతీ, యువకులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. శిక్షణా కాలంలో తక్కువ అద్దెతో యువతీ, యువకులకు వేర్వేరుగా బస వసతి కల్పించనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.editn.in అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదుచేసుకోవచ్చు. వివరాలకు 9543773337, 9360221280అనే నెంబర్లను సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చు.

523 ఆలయాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 523 ఆలయాలకు నాణ్యత సర్టిఫికెట్‌ను భారత ఆహార భద్రత నాణ్యత ప్రమాణాల కమిషన్ అందజేసింది. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఆలయాల్లో అన్నదానం పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకంలో 13 ఆలయాల్లో రోజంతా, 764 ఆలయాల్లో ఒక పూట అన్నదానం జరుగుతోంది. ఆలయాల్లో తయారుచేసి అందించే ప్రసాదం, అన్నదానం నాణ్యతను భారత ఆహార భద్రత నాణ్యత ప్రమాణాల కమిషన్ పరిశీలించి, నాణ్యత సర్టిఫికెట్ అందజేస్తుంది. ఆ ప్రకారం, దేశవ్యాప్తంగా ఆలయాలను పరిశీలించిన కమిషన్, రాష్ట్రంలో 523 ఆలయాలకు నాణ్యత సర్టిఫికెట్ అందజేసింది. మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే రాష్ట్రానికి అధికంగా సర్టిఫికెట్లు లభించాయి. మిగిలిన ఆలయాలకు కూడా నాణ్యత సర్టిఫికెట్ పొందేలా చర్యలు చేపట్టినట్లు హిందూ దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

139 కోట్ల సార్లు మహిళల ఉచిత ప్రయాణం

పెరంబూర్, జూన్6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం పలు పథకాలు అమలుచేస్తోంది. అందులో 'మగలీర్ విడియల్ పయనం' పథకంలో ప్రభుత్వ మెట్రోపాలిటన్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. 2021 నుంచి అమలవుతున్న ఈ పథకాన్ని మహిళలు విశేషంగా ఆదరిస్తున్నారు. ఈ పథకం అమలు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ సాధారణ బస్సుల్లో 139 కోట్ల సార్లు మహిళలు ఉచితంగా ప్రయాణించారు. గత మే నెలలో 3.74 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, 2024 మే నెలతో పోల్చితే 21 శాతం అధికం. గత మే నెలలో ఒకరోజు సరాసరిన 12.06 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

కార్పొరేషన్ పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై పార్లమెంటు నియోజకవర్గంలోని 17 కార్పొరేషన్ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన స్మార్ట్ తరగతులను ఎంపీ కళానిధి వీరాస్వామి ప్రారంభించారు. తిరువొత్తియూర్ టీహెచ్ రోడ్డులో ఉన్న కార్పొరేషన్ జోనల్ కార్యాలయంలో ఎన్నూర్ కామరాజర్ పోర్ట్ సీఎస్ఆర్ ప్రాజెక్ట్, 'నమక్కు నామే' పథకం నుంచి కేటాయించిన రూ.5 కోట్లతో మల్టీలెవల్ భవనం నిర్మాణపనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ శంకర్, జోన్ ఛైర్మెన్ తనియరసు, కార్పొరేటర్లు, జీసీసీ అధికారులు పాల్గొన్నారు.

'యమహా' చెన్నై కర్మాగారంలో 50 లక్షల వాహనాల తయారీ

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఒరగడంలోని యమహా కర్మాగారంలో, ఇప్పటివరకు 50 లక్షల ద్విచక్రవాహనాలు తయారయ్యాయి. 177 ఎకరాల్లో రూ.1,500 కోట్లతో 2015లో ఈ కర్మాగారం ప్రారంభించారు. స్వదేశంలో వాహనాల విక్రయాలు, ఎగుమతులు ఈ కర్మాగారం చేపడుతోంది. కర్మాగారం ప్రారంభించిన పదేళ్లలో 50 లక్షల వాహనాలు తయారుచేశారు. ఇక్కడ, రే-జెడ్ఆర్, పేసినో, ఎరాక్స్ తదితర స్కూటర్లు స్వదేశీ మార్కెట్లోను, ఎఫ్-జెడ్ సిరీస్ సలూలో, ఆల్ఫా రకం వాహనాలు ఎగుమతి చేస్తుంటారు. ఏడాదికి 9 లక్షల వాహనాలు తయారీ సామర్థ్యం కలిగిన ఈ కర్మాగారంలో తయారుచేసిన 30 శాతం వాహనాలు ఎగుమతి చేస్తున్నారు. కాగా, ఈ సంస్థకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సూరజ్‌పూర్‌లో ఉన్న కర్మాగారం ఏడాదికి 6 లక్షల వాహనాల తయారీ సామర్థ్యం కలిగి ఉంది.

కొత్తగా చేపల విక్రయ కేంద్రాలు

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సరసమైన ధరల్లో ప్రజలకు చేపలు విక్రయించేలా కొత్తగా 10 చేపల విక్రయ కేంద్రాలు ప్రారంభించనున్నట్లు మత్స్య శాఖ తెలిపింది. ఈ విషయమై ఆ శాఖ అధికారులు మాట్లాడుతూ... సముద్రతీరం లేని జిల్లాల్లో చేపల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు స్థలాల ఎంపిక ప్రారంభించామన్నారు. అరియలూ, కడలూరు జిల్లా నైవేలీ, ధర్మపురి జిల్లా హొగెనేకల్, తిరునల్వేలి, చెంగల్పట్టు, కృష్ణగిరి తదితర ప్రాంతాల్లో స్థలాల ఎంపిక పూర్తయిందని, మరో నాలుగు ప్రాంతాల్లో స్థలాల పరిశీలన చేపట్టామని తెలిపారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో భవనాలు నిర్మించి, మత్స్య సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న జాలర్లను, కాంట్రాక్ట్ ప్రాతిపదికన స్థలం కేటాయించి, చేపల విక్రయాలకు చర్యలు చేపట్టామని, మార్కెట్ కంటే తక్కువ ధరకు నాణ్యమైన చేపలు ప్రజలకు అందించడమే ఈపథక లక్ష్యమని అధికారులు తెలిపారు.

అరుంధతీయుల అభివృద్ధి కోసం
కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

● సీఎంకు ఎమ్మార్పీఎస్ విజ్ఞప్తి

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అరుంధతీయుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎం కొండయ్య నేతృత్వంలో సీఎంతో భేటీ అయిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుకుమార్, ప్రిసీడియం ఛైర్మన్ సీహెచ్ఏ దేవసహాయం, అధికార ప్రతినిధి కె.కుమార్, విశ్వప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్ ఇ.నాగభూషణం, ఎం.బాలాజీ, నిర్వాహక కార్యదర్శి కె.భాస్కర్, సంయుక్త కార్యదర్శి డీవై శ్రీనివాస్, చెన్నై నేతలు జి.గోపి, రాఘవులు, వై.శ్రీరాం, సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, ఇజ్రాయిల్, తిరువళ్లూరు జిల్లా నేతలు వంశీ, వాసు, కుప్పన్, వెంకటయ్య ఆ మేరకు వినతిపత్రం సమర్పించారు.


సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఎస్సీ-ఎకు 3 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు కృతజ్ఞతలు చెప్పిన నేతలు.. 61/2009 జీవో రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ-ఎ అరుంధతీయుల రిజర్వేషన్లు 8 శాతానికి పెంచాలని, ఎస్సీ కమిషన్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని, రాజకీయ రిజర్వేషన్లలో అరుంధతీయులకు అవార్డు మెంబర్, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు 50 శాతం ఇవ్వాలని చెన్నైలో అరుంధతీయులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. తిరువళ్లూరు జిల్లాలో ప్రత్యేక శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని కూడా నేతలు విన్నవించారు.

తిరువళ్లూరు ఆస్పత్రిలో మారిన మృతదేహాలు

● బిహార్‌కు వృద్ధుడి శవం తరలింపు

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి మార్చురీలో ఓ వృద్ధుడి శవం మాయం కావటంతో కుటుంబీకులు ఆందోళన దిగారు. ఆస్పత్రి నిర్వాహకులు విచారణ జరపగా ఆ శవం బిహార్‌కు పంపినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. బిహార్‌కు చెందిన వ్యక్తి శవానికి బదులుగా ఈ వృద్ధుడి శవాన్ని పంపినట్లు తెలియటంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. ఈ సంఘటనకు సంబంధించి ఆ ఆస్పత్రి ఉద్యోగిని సస్పెండ్ చేశారు. తిరుత్తణి సమీపం పుజ్జిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు కూలీ రాజేంద్రన్ (60) తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ రెండు రోజుల క్రితం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆ వృద్ధుడిని తిరుత్తణి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్సల కోసం తిరువళ్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించగా, చికిత్స ఫలించక రాజేంద్రన్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకుని రాజేంద్రన్ కుటుంబీకులు తిరుత్తణి పోలీసుస్టేషన్ నుంచి పోస్టుమార్టం అనుమతిపత్రం తీసుకువచ్చేందుకు వెళ్లారు. పోలీసుస్టేషన్‌లో అనుమతి పత్రం తీసుకుని తిరువళ్లూరు జిల్లా ఆసుపత్రి మార్చురీలో ఉన్న వృద్ధుడి శవం కోసం వెళ్లారు. ఆ సమయంలో రాజేంద్రన్‌కు బదులుగా మరో వ్యక్తి శవం ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. ఆస్పత్రి సిబ్బంది 55 యేళ్ల వ్యక్తి శవాన్ని తీసుకెళ్ళమంటూ రాజేంద్రన్ కుటుంబీకులపై ఒత్తిడి చేశారు. దీంతో ఆగ్రహం చెందిన రాజేంద్రన్ కుటుంబీకులు మార్చురీలోకి వెళ్లి రాజేంద్రన్ మృతదేహం కోసం వెదికారు. అదే సమయంలో పోలీసులు జోక్యంచేసుకుని అక్కడి సీసీ ఫుటేజీ పరిశీలించగా, రాజేంద్రన్ శవాన్ని బిహార్‌కు చెందిన వ్యక్తులు తీసుకెళుతుండటం కనిపించింది. పోలీసులు మార్చురీ సిబ్బందిని ప్రశ్నించగా బిహార్‌కు చెందిన మనోజ్ మాంచి (55) అనే వ్యక్తి శవానికి బదులుగా రాజేంద్రన్ శవాన్ని అతడి కుటుంబీకులకు ఇచ్చినట్లు వెల్లడైంది. పోలీసులు కేసునమోదు చేసుకుని బిహార్‌కు తీసుకెళ్ళిన రాజేంద్రన్ మృతదేహన్ని తెప్పించేందుకు తగు చర్యలు చేపడుతున్నారు.

వెన్నుపోటుదారులకు కాంగ్రెస్‌లో చోటు లేదు

● పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి

పుదుచ్చేరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు దారులకు కాంగ్రెస్ పార్టీలో చోటులేదని, పుదుచ్చేరిలో కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి ఎన్నికలను ఎదుర్కొంటుందని మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. పుదుచ్చేరిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడు నుంచి శ్రీలంక వెళ్లి తిరిగొచ్చే వారికి అక్కడి ప్రభుత్వం రక్షణ కల్పించకపోవడం ఖండించదగ్గదన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు రైళ్ల పథకం కింద మంజూరు చేసిన నిధులను దక్షిణ రైల్వే తిరిగి కేంద్రానికే పంపించడం సరికాదన్నారు. తమ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు ముందుగానే ఊపందుకున్నాయని, ఇండియా కూటమి ఎన్నికల్లో ఘనవిజయం సాధించి తీరుతుందన్నారు. ముఖ్యమంత్రి రంగస్వామి నేతృత్వంలోని ప్రభుత్వంలో అవినీతి బాగా పెరిగిందని, ఎన్నికల హామీలను ఇప్పటివరకు నెరవేర్చలేదని నారాయణస్వామి ఆరోపించారు.

విద్యాసంస్థల కార్యక్రమాలకు 10 శాతం వినోదపు పన్ను

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల ఆడిటోరియంలో నిర్వహించే వినోద కార్యక్రమాలకు 10 శాతం వినోదపు పన్ను వసూలుచేయనున్నట్లు జీసీసీ ప్రకటించింది. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ప్రభుత్వ వినోదపు పన్ను చట్టం ప్రకారం, గత 2017 నుంచి కార్పొరేషన్ వినోదపు పన్ను వసూలు చేస్తుందన్నారు. ప్రస్తుతం వినోదపు పన్ను చట్టం-2025లో సవరణలు చేసి ఈ ఏడాది ఏప్రిల్ 17వ తేది నుంచి అమలులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. సవరణ చట్టం ప్రకారం, సహకారం, ఛార్జీలు, చందా, ఏదైనా ఒకటి వసూలు చేసే మండపాలు, పాఠశాలల ప్రాంగణాల్లో నిర్వహించే కచేరీలు, నాటక ప్రదర్శనలు తదితరాలకు 10 శాతం వినోదపు పన్ను వసూలుచేయనున్నట్లు జీసీసీ తెలిపింది.

నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకం

● ఈపీఎస్

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజన వల్ల తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి ఉన్నట్లయితే, దానిని వ్యతిరేకిస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. ఆయన శుక్రవారం తన ఎక్స్ పేజీలో... రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమాలు పెరిగాయని, కుటుంబ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, నియోజకవర్గాల పునర్విభజన గురించి మాట్లాడుతున్నారని, అయితే రాష్ట్రానికి పునర్విభజన వల్ల ఏ విధంగా నష్టం జరుగుతుందో ప్రజలకు వివరించలేదన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ఎప్పుడు జరిగినా అందులో రాష్ట్ర హక్కులకు భంగం కలుగకుండా వ్యవహరించాల్సిందిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను తాను ఢిల్లీలో కలిసిన సమయంలోనే ప్రతిపక్ష నేతగా తాను కోరినట్లు పళనిస్వామి తెలిపారు.

రైల్వేప్రాజెక్టుల నిధుల్లో ఎలాంటి మార్పు లేదు

● దక్షిణ రైల్వే

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని రైల్వే ప్రాజెక్టులకు నిధులు తగ్గించారంటూ జరుగుతున్న ప్రచారాన్ని దక్షిణ రైల్వే తీవ్రంగా ఖండించింది. ఆయా ప్రాజెక్టులకు కేటాయించిన నిధుల్లో ఎలాంటి మార్పు లేదని, అవగాహన లేమితో కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని స్పష్టం చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మంత్రిత్వ శాఖ సంబంధించిన ప్రాజెక్టులకు చేసిన బడ్జెట్ కేటాయింపుల ప్రకారం అమలు చేయాలని సూచించిందని పేర్కొంది. దక్షిణ రైల్వే తన అధికార పరిధిలో మంజూరు చేసిన అన్ని ప్రాజెక్టులను అమలు చేయడానికి కట్టుబడి వుందని దక్షిణ రైల్వే చీఫ్ పీఆర్వో ఎం.సెంతమిళ్ సెల్వన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా కరుణానిధి జయంతి వేడుకలు

తిరుత్తణి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని అతిమాంజేరిపేటలో దివంగత మాజీముఖ్యమంత్రి కరుణానిధి జయంతిని పురస్కరించుకుని మండల డీఎంకే కార్యదర్శి బీడీ చంద్రన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పళ్లిపట్టు, అత్తిమాంజేరిపేట ప్రాంతాలకు చెందిన డీఎంకే నాయకులు కలైంజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు వస్త్ర, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం నిర్వాహకులు మురళీసేన, గోవర్ధన్ నాయుడు, ఎం.శివకుమార్, వీవీ మణి, ఎంకే సురేష్, ఎం.సెల్వం, పీడీ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు వస్త్రదానం చేస్తున్న డీఎంకే నిర్వాహకులు

ఉపాధి కార్మికుల వేతనం పెంపు

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికుల వేతనం రూ.319 నుంచి రూ.336 పెంచారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అమలుపరుస్తున్న ఉపాధి హామీ పథకంలో సంవత్సరంలో వంద రోజులు కుటుంబంలో ఒకరికి పనిచేసే అవకాశం కల్పించారు. ఇందులో పనిచేస్తున్న కార్మికులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వేతనం ఇస్తున్నాయి. కాగా, ఈ కార్మికులకు వేతనం పెంచాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖకు ఫలితం దక్కింది. ఆ మేరకు, రాష్ట్రంలో ఉపాధి కార్మికుల ఒకరోజు వేతనం రూ.319 నుంచి రూ.336కు పెరిగింది. బకాయిలను కూడా త్వరలో పంపిణీ చేయనున్నట్లు స్థానిక సంస్థల అధికారులు తెలిపారు.

తాగునీటి బోర్డులో ఏడాదికి రూ.90 కోట్ల అవినీతి

● విచారణ అన్బుమణి డిమాండ్

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తాగునీటి బోర్డులో ఏడాదికి రూ.90 కోట్ల అవినీతి జరిగిందనే ఫిర్యాదుపై విచారణ జరపాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... తాగునీటి బోర్డులో అవకతవకలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా శిక్షించాలని, విచారణ పారదర్శకంగా ఉండాలని కోరారు. తాగునీటి బోర్డులో ఎలక్ట్రీషియన్లు, విద్యుత్ మోటారు మెకానిక్‌లు, సహాయకులు మొత్తం 11,597 మంది కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్నారని, వీరికి ప్రతినెలా ఇచ్చే వేతనం వివరాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

12న మహిళా సంక్షేమ బోర్డులో సభ్యత్వ నమోదు

● చెన్నై కలెక్టర్ రశ్మీ సిద్ధార్థ్

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమ బోర్డులో సభ్యత్వ నమోదు ఈ నెల 12న జరుగుతుందని చెన్నై కలెక్టర్ రశ్మీ సిద్ధార్థ్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో నివసిస్తున్న దారిద్ర్య రేఖ దిగువన ఉన్న కుటుంబాల మహిళలు, దివ్యాంగ మహిళలు, భర్త విడిచి పెట్టిన మహిళలు మహిళా సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరేందుకు స్థానిక హార్బర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు సభ్యత్వ నమోదు కార్యాక్రమం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనదలిచిన లబ్దిదారులు టెలిఫోన్ నెంబర్, రేషన్‌కార్డు నకలు, ఆధార్ నకలుతో వెళ్ళి సభ్యులుగా చేరి గుర్తింపుకార్డు పొందవచ్చు. ఈ కార్డు పొందినవారు జిల్లా యంత్రాంగం నిర్వహించే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో పాల్గొని స్వయం వృత్తిని ప్రారంభించుకోవచ్చు. థాడ్కో రాయితీతో కూడిన రుణం కూడా పొందవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పాఠశాలకు 'లీవ్' పెడితే తల్లిదండ్రులను పిలవండి ..!

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యార్థులు సెలవు తీసుకుంటే, మరుసటిరోజు వారి తల్లిదండ్రులను పిలిపించి కారణ తెలుసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో, పాఠశాలల్లో విద్యార్థులు పాటించాల్సిన విధివిధానాలకు హెచ్ఎంలకు విద్యాశాఖ పంపింది. ఆ ప్రకారం, పాఠశాలకు విద్యార్థులు యూనిఫాం మాత్రమే ధరించి రావాలి, తలపై వెంట్రుకలు ఎక్కువగా ఉంటే 'స్మార్ట్' కటింగ్ చేయించాలి, రంగురంగుల బొట్టు పెట్టడం, కండువాలు ధరించడం, చేతులకు దారాలు కుట్టుకోవడం తదితరాలను అనుమతించరాదు, కత్తి, పదునైన వస్తువులు, సైకిల్ చైన్ తదితరాలను విద్యార్థులు తీసుకురాకూడదు తదితరాలను ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్‌లో సూచించింది.

అమరావతి డ్యాం నుంచి సాగునీరు

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా అమరావతి డ్యాం నుంచి తొలి ఆయకట్టుకు శనివారం నుంచి అక్టోబరు 20వ తేది వరకు సాగు నీరు విడుదల చేయనున్నారు. ఈ మేరకు సచివాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో.. 2,073.60 మిలియన్ ఘనపుటడుగుల జలాలను విడుదల చేయనున్నట్లు, ఈనీటితో తిరుప్పూర్ జిల్లాలో 7,520 ఎకరాల ఆయకట్టు రైతులు లబ్ధిపొందుతారని సచివాలయం తెలియజేసింది.

ఖైదీ దంతాలు తొలగించిన కేసు

● కోర్టుకు హాజరైన ఐపీఎస్ అధికారి

అడయార్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ నిందితుడి దంతాలు పీకేసిన కేసులో ఐపీఎస్ అధికారి బల్వీర్ సింగ్ తిరునెల్వేలి జిల్లా క్రైమ్ కోర్టుకు హాజరయ్యారు. జిల్లాలోని అంబాసముద్రం సబ్ డివిజన్ ఏఎస్పీగా బల్వీర్ సింగ్ 2023లో పని చేశారు. ఆ సమయంలో విచారణ నిమిత్తం ఠాణాకు వచ్చిన ఓ నిందితుడు దంతాలు పీకేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనిపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం ముందుకు వచ్చి ఈ కేసు విచారణ చేపట్టింది. ఇదే కేసులో బల్వీర్ సింగ్ సస్పెన్షన్‌లో ఉన్నారు. ఆ తర్వాత నెల్లై సీబీసీఐడీ కేసు నమోదు చేసి విచారణ జరిపి అనేక షాకింగ్ విషయాలను గుర్తించారు. ఈ కేసు విచారణ నెల్లై జిల్లా క్రైమ్ కోర్టులో సాగుతోంది. ఇందులో భాగంగా, శుక్రవారం మరోమారు ఈ కేసు విచారణకు రాగా, బల్వీర్ సింగ్ కోర్టుకు హాజరయ్యారు.

విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో ముద్దాయికి 20 యేళ్ళ జైలు

అడయార్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో ఒంటరిగా ఉన్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ముద్దాయికి తిరునెల్వేలి జిల్లా పోక్సో కోర్టు 20 యేళ్ళ జైలు శిక్ష విధించింది. తాజాగా వెలువడిన ఈ తీర్పు వివరాలను పరిశీలిస్తే, నెల్లై జిల్లా మున్నీర్‌పల్లం ప్రాంతానికి చెందిన వేలాయుధం (30) అనే వ్యక్తి 2019లో విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు పూర్తి చేయగా, కేసు విచారణ జిల్లా పోక్సో కోర్టులో సాగింది. ఈ కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి సురేష్ కుమార్ నిందితుడు వేలాయుధంను ముద్దాయిగా తేల్చి, 20 యేళ్ళ జైలు శిక్ష, రూ.20 లక్షల అపరాధం విధిస్తూ తీర్పునిచ్చింది.

మంత్రి దురైమురుగన్‌కు అస్వస్థత

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన గత నెల 8వ తేదీ అస్వస్థత కారణంగా నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొంది 10వ తేది డిశ్చార్జి అయ్యారు. శుక్రవారం మళ్లీ ఆయన అస్వస్థతకు గురికావడంతో క్రోంపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయనకు వైద్య బృందం చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

● 'నీట్' వ్యవహారం ..

విద్యార్థుల పిటిషన్ తోసివేత

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేసినందున్న 'నీట్' పరీక్ష పూర్తిగా రాయలేకపోయామని, అందువలన మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరుతూ 16 మంది విద్యార్థులు దాఖలుచేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. వైద్య విద్యలో ప్రవేశాల కోసం మే నెలలో జాతీయస్థాయి పరీక్ష నిర్వహించారు. ఆ రోజు స్థానిక ఆవడి కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రంలో 13 మంది విద్యార్థులు, కుండ్రత్తూర్ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఇద్దరు, కేకే నగర్ పద్మాశేషాద్రి పాఠశాలలో ఒకరు పరీక్ష రాస్తున్న సమయంలో, వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పరీక్ష పూర్తిగా రాయలేకపోయామని, అందువల్ల పరీక్ష మళ్లీ నిర్వహించాలని 16 మంది విద్యార్థులు దాఖలుచేసిన పిటిషన్ విచారించిన హైకోర్టు, నీట్ ఫలితాల విడుదలపై తాత్కాలిక స్టే విధించింది. ఈ నేపథ్యంలో, ఈ కేసు మళ్లీ హైకోర్టులో విచారణకు రాగా విద్యుత్ సరఫరా నిలిపివేతపై జరిపిన విచారణలో... నీట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగలేదని, అన్ని ప్రశ్నలకు పిటిషనర్లు సమాధానాలు రాశారని, అందువల్ల మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్టీఏ) అఫిడవిట్ దాఖలుచేసింది. దీంతో, ఈ కేసుకు సంబంధించి వాయిదావేసిన విచారణ శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి సి.కుమరప్పన్ సమక్షంలో జరిగింది. ఇరుతరపు వాదనల అనంతరం, 22 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, అందువల్ల మళ్లీ ఈ పరీక్ష నిర్వహించడం సాధ్యం కాదంటూ 16 మంది విద్యార్థుల పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు.

● ఈము కోళ్ల మోసం కేసులో..

యజమానికి 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.7.89 కోట్ల జరిమానా

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈము కోళ్ల పెంపకంలో లాభాలు వస్తాయంటూ మోసం చేసిన కేసులో యజమానికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.7.89 కోట్ల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. 2011లో ఈరోడ్‌లో ఈము కోళ్ల పెంపకం ప్రారంభించిన గురుస్వామి, ఈ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే ఈము కోళ్ల గుడ్లు, మాంసం విక్రయాల ద్వారా మంచి ఆదాయం సమకూరుతుందని ప్రకటించాడు. అతడి మాటలు నమ్మిన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పెట్టుబడులు పెట్టారు. కానీ, ఆ తర్వాత వ్యాపారంలో నష్టం వచ్చిందంటూ గురుస్వామి చెప్పడంతో, దిగ్భ్రాంతి చెందిన పెట్టుబడిదారులు సేలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యహారంలో 385 మంది మోసపోయారంటూ పోలీసులు అందజేసిన నివేదిక ఆధారంగా, కోయంబత్తూర్ పెట్టుబడిదారుల సంక్షేమ కోర్టు, ఈము కోళ్ల ఫాం యజమాని గురుస్వామికి పదేళ్ల జైలుశిక్ష, రూ.7.89 కోట్ల జరిమానా విధించింది. జరిమానాపై అప్పీలు కాలం ముగిసిన తర్వాత 385 మంది పెట్టుబడిదారులకు జరిమానా సమానంగా పంచాలంటూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వ బస్సులకు డీజిల్ నింపడంలో అవినీతి

● మేనేజర్ సహా నలుగురిపై సస్పెన్షన్ వేటు

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సులకు డీజిల్ నింపడంలో అవినీతికి పాల్పడిన డిపో మేనేజర్ సహా నలుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. తిరునల్వేలి జిల్లా తామ్రభరణి బస్సు డిపోలో ప్రతిరోజు 58 బస్సులకు సుమారు 60 వేల లీటర్ల డీజిల్ నింపుతుంటారు. కొద్దిరోజులుగా బస్సులకు నింపుతున్న డీజిల్ పరిమాణంలో తేడాల గుర్తించిన అధికారులు చేపట్టిన విచారణలో, 16వేల లీటర్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో డిపో మేనేజర్ కృష్ణన్‌కుమార్, సూపర్ వైజర్ జబరాజ్ సహా నలుగురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విమానంపై లేజర్ కిరణాలు

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):నగరంలో ల్యాండింగ్ అవుతున్న విమానంపై ఆకుపచ్చ రంగుతో లేజర్ వెలుగులు ప్రసరించాయని పైలెట్ ఫిర్యాదు చేశారు. దుబాయ్ నుంచి 304 మంది ప్రయాణికులతో నగరానికి వచ్చిన ఎమిరేట్స్ విమానం ల్యాండ్ అయ్యే సమయంలో లేజర్ కిరణాలు ప్రసరించాయి. పది రోజుల వ్యవధిలో రెండోసారి విమానంపై లేజర్ లైట్లు ప్రసరించడం గమనార్హం. సెయింట్ థామస్ మౌంట్ ప్రాంతం నుంచి శక్తివంతమైన ఆకుపచ్చ రంగు లేజర్ కిరణాలు ప్రసరించినట్లు విచారణలో తెలిసింది.

తండ్రి మందలించాడని విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి పనులు చేయడం లేదని తండ్రి మందలించడంతో విద్యార్థిని విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూత్తుకుడి జిల్లాలో చోటుచేసుకుంది. నాలాట్టిన్‌పుదూర్ సమీపం చెన్నంపట్టి వెస్ట్ వీధికి చెందిన ముత్తుస్వామి కుమార్తె కార్తీప్రియ (20) డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతోంది. కళాశాల నుంచి వచ్చే కార్తీప్రియ, ఇంట్లో పనులు చేయడం లేదని తెలుస్తోంది. ఘటన జరిగిన రోజున పనులు చేయకుండా సోఫాలో కూర్చున్న కుమార్తెను తండ్రి మందలించాడు. కొద్దిసేపటికి తల్లిదండ్రులు బయటకు వెళ్లిన సమయంలో, కార్తీప్రియ విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటికొచ్చిన తల్లిదండ్రులు అపస్మారక స్థితిలో పడిన ఆమెను కోవిల్ పట్టి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక గురువారం రాత్రి ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై నాలాట్టిన్‌పుదూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


● లైంగిక వేధింపుల కేసు...

ముంబైలో బీజేపీ మాజీ నేత అరెస్ట్

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ మాజీ నేతను ముంబైలో పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా సురండై గ్రామంలో ఓ బాలికను తుపాకితో బెదిరించి అత్యాచారయత్నం చేసినట్లు బీజేపీ నేత నీలకంఠన్‌పై ఆలంగుళం పోలీసులు కేసు నమోదుచేశారు.అప్పటినుంచి పరారీలో ఉన్న నీలకంఠన్ ముంబైలో ఉన్నాడనే సమాచారంతో,ఆలంగుళం పోలీసులు ముంబైవెళ్లి నీలకంఠన్‌ను అరెస్ట్‌చేశారు.

బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జనార్ధనం కన్నుమూత

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు ● ప్రముఖుల సంతాపం


జనార్ధనం (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎంఎస్ జనార్ధనం (89) వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. జనార్ధనం అంత్యక్రియలు పోలీసు లాంచనాలతో నిర్వహించనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. జస్టిస్ ఎంఎస్ జనార్ధనం 1988 నుంచి 1998 వరకు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి, చారిత్రాత్మకమైన పలు తీర్పులు వెలువరించారు. 2006 నుంచి 2015 వరకు తమిళనాడు బీసీ కమిషన్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన ప్రతిపాదన మేరకు రాష్ట్రంలో ముస్లింలు, క్రైస్తవులు, అరుంధతీయులకు ప్రభుత్వం రిజర్వేషన్ అమలు చేసింది. ఆయన న్యాయశాఖకు, రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడేలా పోలీసు లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎంతో పాటు ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి, టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేలు, పలు దళిత సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

గిరి ప్రదక్షిణ మార్గంలో అక్రమ నిర్మాణాలు

● నివేదిక కోరిన హైకోర్టు

పెరంబూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గంలో చట్టవిరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలు తొలగించేందుకు చేపట్టిన చర్యలపై ఈ నెల 20వ తేదిలోగా తిరువణ్ణామలై జిల్లా కలెక్టర్ నివేదిక సమర్పించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గిరి ప్రదక్షిణ మార్గంలో చట్టవిరుద్ధంగా నిర్మించిన భవనాలు తొలగించాలని న్యాయవాది యానై రాజేంద్రన్ పిటిషన్ వేశారు. ఈ కేసులో, గిరి ప్రదక్షిణ మార్గంలో అనుమతి లేకుండా 1,935 కట్టడాలు నిర్మించినట్లు న్యాయమూర్తి గోవిందరాజన్ నేతృత్వంలోని కమిటీ హైకోర్టులో నివేదిక దాఖలుచేసింది.

కమల్ చిత్రానికి దర్శకత్వం చేయాలనివుంది

● అమీర్



'థగ్ లైఫ్' సినిమా చూసిన తర్వాత అగ్ర నటుడు కమల్ హాసన్ చిత్రానికి దర్శకత్వం చేయాలనే ఆశ కలిగిందని దర్శకనడుడు అమీర్ అన్నారు. మణిరత్నం - కమల్ హాసన్ కాంబోలో తెరకెక్కిన 'థగ్ లైఫ్' గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన విషయం తెల్సిందే. ఈ సినిమా విడుదలైన తొలి రోజు తొలి ఆటను అనేక మంది సినీ ప్రముఖులు వీక్షించారు. వీరిలో దర్శకుడు అమీర్ కూడా ఉన్నారు. ఈ సినిమాపై ఆయన మాట్లాడుతూ, 'గత నాలుగు దశాబ్దాలుగా కమల్ హాసన్ సినిమా విడుదలయ్యే తొలి రోజునే మదురైలో చూస్తాను. సరైన సమయంలో సరైన వ్యక్తులకు అండగా నిలబడటం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. సినిమాలోని భాష గురించి ఆయన తప్పుగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. కావేరీ నదీ జలాలు, కన్నడ భాషలపై ఆయన తప్పుగా ఏం మాట్లాడలేదు. ద్రావిడ కుటుంబం ప్రేమ, సామరస్యం గురించి మాత్రమే ఆయన చెప్పారు. కమల్ హాసన్‌ను డైరెక్ట్ చేయాలన్న ఆశ ఉంది. రెండుమూడుసార్లు ఆ విషయంపై ఆయనతో చర్చించాను కూడా. 'వడచెన్నై-2' వచ్చే యేడాది విడుదలకానుంది. వెట్రిమారన్ 'వాడివాసల్' షూటింగ్ ఆగస్టు నుంచి మొదలవుతుంది' అన్నారు.

'జన నాయగన్'ను అడ్డుకుంటాం

● వేల్‌మురుగన్



అగ్ర నటుడు కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' చిత్రాన్ని కర్ణాటక రాష్ట్రంలో విడుదలకాకుండా అడ్డుకున్నారనీ, అందువల్ల మరో అగ్రహీరో విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్రాన్ని మన రాష్ట్రంలో విడుదల కాకుండా అడ్డుకుంటామని తమిళగ వాళ్వురిమై కట్చి అధ్యక్షుడు టి.వేల్‌మురుగన్ హెచ్చరించారు. కన్నడకు మాతృభాష తమిళం అంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు కర్ణాటక రాష్ట్రంలో పెను దుమారాన్ని రేపాయి. దీంతో కన్నడ సినీ రాజకీయ నేతలు 'థగ్ లైఫ్' చిత్రాన్ని కర్ణాటక రాష్ట్రంలో విడుదల కాకుండా అడ్డుకున్నారు. దీనిపై వేల్‌మురుగన్ మాట్లాడుతూ, 'విజయ్ నటిస్తున్న 'జన నాయగన్' చిత్రాన్ని కర్ణాటకకు చెందిన నిర్మాణ సంస్థ నిర్మిస్తోంది. ఇపుడు కమల్ 'థగ్ లైఫ్' మూవీని విడుదల కాకుండా అడ్డుకున్నారు.రేపు కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ నిర్మించే విజయ్ 'జన నాయగన్'ను విడుదలకాకుండా అడ్డుకుని తీరుతాం' అని ఆయన ప్రకటించారు.కాగా, తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పి సినిమాను రిలీజ్ చేసుకోవచ్చని కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి చేసిన సూచనను కమల్ హాసన్ స్వీకరించకుండా కన్నడలో విడుదలను నిలిపివేసిన విషయం తెల్సిందే.

చిత్రజ్యోతి

డైలామాలో రంభ!



సినీ నటి రంభ తన మకాంను కెనడా నుంచి చెన్నైకి మార్చారు. ఇపుడు ఏం చేయాలన్న అంశంపై అంశంపై తర్జనభర్జన చెందుతున్నారు. తమిళం, తెలుగు చిత్రాల్లో హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన రంభ. కెనడాకు చెందిన ఇంద్రన్ అనే పారిశ్రామికవేత్తను వివాహం చేసుకుని అక్కడే స్థిరపడిపోయారు. ఈ క్రమంలో ఆమె ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. అయితే, పిల్లలు ఎదిగేంత వరకు అక్కడే ఉన్న రంభ.. ఇపుడు మళ్ళీ తన కెరీర్‌పై దృష్టిసారించారు. ఇందుకోసం ఆమె చెన్నైకి తన మకాంను మార్చారు. అయితే, ఇపుడు నటిగా ఎంట్రీ ఇవ్వాలా లేదా సినీ నిర్మాణంలో పాలుపంచుకోవాలన్న అంశంపై ఆమె మల్లగుల్లాలు పడుతున్నారు. తన భర్త ధనవంతుడు కావడంతో సినీ నిర్మాణంలో అడుగుపెట్టాలని ఆమె భావిస్తున్నారు. అయితే, ప్రస్తుతం ఇండస్ట్రీలో ఏమాత్రం సానుకూల వాతావరణం కనిపించడం లేదు. దీంతో సినిమాల్లో తనకు వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని నటిగా రాణించాలన్న ఆలోచన కూడా ఉంది. ఇదిలావుంటే, తన 49వ పుట్టిన రోజు వేడుకలను ఈ నెల 5వ తేదీన జరుపుకున్నారు.

20న అధర్వ మురళి 'డీఎన్ఏ' రిలీజ్

నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వంలో అధర్వ మురళి, నిమిషా సజయన్ జంటగా నటించిన తాజా చిత్రం 'డీఎన్ఏ'. నిర్మాణాంతర పనుల్లో జాప్యం జరగడంతో విడుదల తేదీని వెల్లడించలేదు. అయితే, ఈ నెల 20వ తేదీ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించి, అధికారికంగా ప్రకటించారు.



'డీఎన్ఏ'లో ఓ దృశ్యం

త్వరలోనే ఈ మూవీ ఆడియో, ట్రైలర్ విడుదల చేయనున్నారు. అంబేత్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ మూవీస్ విడుదల చేయనుంది. ఇప్పటికే అనేక మంది నిర్మాతలు మూవీని చూసి దర్శక నిర్మాతలను ప్రశంసించారు. అలాగే, మూవీ ఓటీటీ, శాటిలైట్ హక్కులను జియో హాట్‌స్టార్, విజయ్ టెలివిజన్ సొంతం చేసుకున్నాయి. ఆడియోను థింక్ మ్యూజిక్ కైవసం చేసుకుంది.



ప్రకృతిసిద్ధంగా ఉత్పత్తిచేసే వస్తువులకు ఎల్లప్పుడూ గిరాకీ ఉంటుంది. ఇటీవలి కాలంలో ఆహార పదార్థాల్లో కల్తీ పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి అందరూ సాంప్రదాయ ఆహార అలవాట్లకు మారుతున్నారు. ఆర్గానిక్ పద్ధతిలో పండించే కాయగూరలు, ధాన్యాలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను కొనేందుకు పోటీపడుతున్నారు. అంకితభావంతో సేంద్రియ వ్యవసాయం చేపట్టి ,ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు నామక్కల్‌కు చెందిన ప్రియా శివప్రకాశం. తన సొంత భూముల్లోనే సేంద్రియ సాగు పద్ధతులను అవలంబిస్తూ 20కిపైగా పంటలను ఉత్పత్తిచేస్తూ 'ఆర్గానిక్ ఫార్మర్' పేరుతో వాటిని విక్రయిస్తున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి



ఏపుగా పెరిగిన ముల్లంగితో

చదివింది ఎంబీఏ
సేంద్రియ వ్యవసాయంలో మేటి

● 'ఆర్గానిక్ ఫార్మర్' ప్రియా ప్రకాశం

తరుణి

వ్యవసాయమే ఆధారం...

ప్రస్తుతం యువతీ యువకులంతా డిగ్రీలు చదివి ఉన్నత ఉద్యోగాలవైపు దృష్టిని సారిస్తుంటే ఎంబీఏ చదివిన ప్రియా శివప్రకాశం సేంద్రియ వ్యవసాయాన్ని ఉన్నతస్థితికి చేర్చాలని కంకణం కట్టుకున్నారు. ఇందుకు గల కారణాలను ప్రియ వివరించారు... "మా సొంతూరు నామక్కల్ జిల్లాలోని ఓ కుగ్రామం. ఆ గ్రామం ఎల్లప్పుడు పంటపొలాలతో కళకళలాడుతుంటుంది. గ్రామంలోని పెద్దలంతా సేంద్రియ వ్యవసాయమే చేస్తున్నారు. ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ఎంబీఏ చదివినా, ఎందుకనో ఉద్యోగం చేయడానికి ఇష్టం లేక వ్యవసాయంపై ఆసక్తి ఏర్పడింది. మా సొంత భూముల్లోనే సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టాం. సేంద్రియ వ్యవసాయానికి రసాయనాలకు తావులేని ప్రకృతిసిద్ధమైన ఎరువులు అవసరం. ఊరిలోని రైతు పెద్దలంతా సేంద్రియ వ్యవసాయం చేస్తుండటంతో ఆ ఎరువులు ఎలా తయారు చేయాలో తెలుసుకున్నాను. వ్యవసాయాన్ని ప్రారంభించడానికి ముందు అలాంటి ఎరువులనే తయారు చేసి విక్రయించాము. స్థానికులు, రైతుపెద్దల సహకారం వల్లే ప్రస్తుతం 'ఆర్గానిక్ ఫార్మర్' పేరుతో ఓ సంస్థ నడుపుతూ ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నాము. రసాయనిక ఎరువులు, క్రిమినాశకాలు లేని రోజుల్లో రైతులు ఎలా సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తుండేవారో ఆ పద్ధతిలోనే సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాను. మేము పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులన్నీ నాణ్యంగా ఉంటాయి. మా భూముల్లో పండించిన కొబ్బరి, వేరుశెనగ, సుగంధ ద్రవ్యాలను వేర్వేరుగా కొయ్య గానుగలో ఆడించి కొబ్బరి నూనె, వేరుశెనగ నూనె, మూలికల హెయిర్ ఆయిల్, ఇదే విధంగా నిమ్మ ఊరగాయ, మునగాకు పొడి, ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన ఫేస్ ప్యాక్, తేనె, ములకల జొన్న పిండి, పసుపు వంటి 20కి పైగా ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయిస్తున్నాం.



తమ సంస్థలో తయారైన ఉత్పత్తులతో ప్రియ

సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలి...

సేంద్రియ వ్యవసాయంలో ఎంతో సాధించవచ్చు. నవీన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని, సేంద్రియ వ్యవసాయం, దాని నుండి వచ్చే విలువ ఆధారిత ఉత్పత్తులను నేరుగా ప్రజలకు అందించవచ్చు. సేంద్రియ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం కీలపాత్ర వహిస్తుంది. పొలంలో వేసిన పంటలను, నాటిన మొక్కలను ప్రతిరోజూ పరిశీలిస్తూ అవి ఏపుగా పెరిగేంత దాకా అంటే కోతకు వచ్చేంతదాకా వాటిని కంటికి రెప్పలా కాపాడాలి. సేంద్రియ వ్యవసాయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే నా లక్ష్యం." అని ప్రియ తరుణితో తన అనుభవాలను పంచుకున్నారు.



తన జన్మదినం సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆయన నివాసంలో కలుసుకుని ఆశీస్సులు అందుకుంటున్న సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్

చిన్నికృష్ణన్ ఇన్నోవేషన్ అవార్డులకు ఆహ్వానం

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కెవిన్‌కేర్, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎంఎంఏ)తో కలిసి చిన్నికృష్ణన్ ఇన్నోవేషన్ అవార్డుల నామినేషన్లను ప్రారంభించింది. ఈ అవార్డుల కోసం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్లకు మించని వార్షిక టర్నోవర్ గల కంపెనీలు www.ckinnovationawards.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఔత్సాహికులు జూలై 1వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దీని గురించి కెవిన్‌కేర్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీకే రంగనాథన్ మాట్లాడుతూ.. ఈ అవార్డు మూలం రోజువారీ జీవితంలో అర్థవంతమైన మార్పును తీసుకువచ్చే ఆవిష్కరణేనని తెలిపారు. విజేతకు రూ. లక్ష బహుమతితో పాటు మార్కెటింగ్, ఫైనాన్స్, డిజైన్, ప్యాకేజింగ్, పేటెంట్ అప్లికేషన్, మానవ వనరుల అభివృద్ధి వంటి రంగాల్లో అనేక విధాలా మద్దతు అందించబడుతుందని వివరించారు.

నవీన్ స్టార్‌వుడ్ టవర్స్‌కు పీఎం ఆవాస్ యోజన అవార్డు

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ రంగానికి చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా రియల్ ఎస్టేట్ డెవలపర్స్ నవీన్స్ వరుసగా మూడో సారి ప్రధానమంత్రి ఆవాస్ యోజన అవార్డును గెలుచుకుంది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు ఈ అవార్డును నవీన్స్ సీఈవో ఎస్.కల్యాణరామన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కల్యాణరామన్ మాట్లాడుతూ.. తమిళనాడులో ఈ అవార్డు అందుకున్న ఏకైక రియల్ ఎస్టేట్ డెవలపర్స్ సంస్థ తమదేనని, ఈ అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా వుందని తెలిపారు. తమ అన్ని ప్రాజెక్టుల్లో అత్యుత్తమ విలాసవంతమైన సౌకర్యాలున్నాయని వివరించారు.



అవార్డు అందుకుంటున్న నవీన్ జీవోవో కల్యాణ రామన్

నేత్రపర్వం... శనీశ్వరుడి రథోత్సవం

● పోటెత్తిన భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుదుచ్చేరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సమీపంలోని కారైక్కాల్ తిరునల్లారులో ప్రపంచ ప్రసిద్ధిచెందిన దర్బారణేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం జరిగిన రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించారు. శనీశ్వరుడు కొలువుదీరిన ఈ ఆలయ బ్రహ్మోత్సవాలు గత నెల 23న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నవగ్రహాలకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానాంశమైన రథోత్సవం కోలాహలంగా జరిగింది. ముందుగా సెన్బగ త్యాగరాజర్, నిలోత్పాలంబాళ్, విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యుడు, చండికేశ్వరుల ఉత్సవమూర్తులను అలంకరించి చిన్న రథాల్లో ఆశీనులను చేశారు. శనీశ్వరుడిని కొలువుదీర్చిన పెద్ద రథం ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి కదిలింది భక్తులు రథం తాడు లాగి మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవంలో కేరళ సంప్రదాయ చెండీ మేళం, తమిళనాడుకు చెందిన సన్నాయి మేళం, జానపద కళాకారులు పాల్గొన్నారు. ఈ వేడుకలకు నాగపట్టణం, కారైక్కాల్, తిరువారూరు, మైలాడుదురై జిల్లాలకు చెందిన సుమారు 5 వేల మందికి పైగా భక్తులు హాజరయ్యారు. భక్తుల సౌకర్యార్థం కారైక్కాల్ జిల్లాకు శుక్రవారం స్థానిక సెలవు ప్రకటించారు. ఈ వేడుకల్లో పుదుచ్చేరి మంత్రి సాయిశరవణకుమార్, ఎమ్మెల్యే పీఆర్ శివ, డీఐజీ శక్తి చంద్రన్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో అలక్ష్యం వద్దు

● నటి సాక్షి అగర్వాల్



అపెక్స్ ప్రారంభోత్సవంలో సాక్షి అగర్వాల్, డాక్టర్ దినేష్ చందర్

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నిత్యం బిజీగా ఉండే ప్రజలు ఆరోగ్యం విషయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వరని, కానీ ఈ వ్యవహారంలో అలక్ష్యం వద్దని ప్రముఖ సినీ నటి సాక్షి అగర్వాల్ సూచించారు. నీలాంగరైలో ఏర్పాటు చేసిన 'అపెక్స్ వెల్నెస్ కో' శుక్రవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాక్షి మాట్లాడుతూ.. ఆపెక్స్‌లోని చికిత్సలు ఆకట్టుకుంటాయన్నారు. ఇది క్లినిక్ కంటే ఎక్కువన్నారు. అపెక్స్ వెల్నెస్ కో అనేది 15 సంవత్సరాలుగా క్లినికల్ అనుభవమున్న సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దినేష్ చందర్ ఆండియప్పన్ ఆలోచన అని వివరించారు. డాక్టర్ దినేష్ చందర్ మాట్లాడుతూ.. ప్రజల్ని ముందుగానే అప్రమత్తం చేసి, మెరుగ్గా కదిలేందుకు, దృఢంగా జీవించడానికి సహాయం చేసేదే అపెక్స్ వెనుక వున్న ఆలోచన అని పేర్కొన్నారు.

వైభవంగా గంగాదీశుడి రథోత్సవం



అమ్మవారి రథాన్ని లాగుతున్న మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషవాక్కంలోని సుప్రసిద్ధ గంగాదీశ్వరాలయ వైకాశి విశాఖ రథోత్సవ వేడుకలు శుక్రవారం ఉదయం కనులపండువగా జరిగాయి.. రథోత్సవం సందర్భంగా గంగాదీశ్వర స్వామి, పంకజాంబాళ్ అమ్మవారికి వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు, పూజలు నిర్వహించారు. రూ.81లక్షలతో ఇటీవలే నిర్మించిన మహారథం, మరమ్మతు చేసిన అమ్మవారి చిన్న రథాన్ని అలంకరించారు. ఆ తర్వాత మహారథంపై స్వామివారం, చిన్న రథంపై అమ్మవారు సర్వాలంకరణశోభితులై ఆశీనులయ్యారు. ఈ వేడుకల్లో పాల్గొన్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు, ఆ శాఖ అధికారులు రథంమోకుతాళ్ళను పట్టుకుని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత రెండు రథాలు గంగాదీశ్వర ఆలయ వీధి, డాక్టర్ అళగప్పారోడ్డు, ఆడియప్పా వీధి, వెళ్లాల వీధి, పురుషవాక్కం హైరోడ్డు, వెల్‌కమ్ హోటల్ కూడలి దాకా ఊరేగి రథమంటప ప్రాంతానికి తిరిగొచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి శేఖర్ బాబు మాట్లాడుతూ గంగాదీశ్వరాలయానికి స్వర్ణరథం తయారీ పనులు చురుకుగా సాగుతున్నాయని, ఆ రథం తయారీకి 7 కేజీల బంగారాన్ని కూడా కేటాయించినట్లు తెలిపారు. వచ్చే యేడాది జనవరిలో ఈ కొత్త స్వర్ణ రథం ఆలయానికి మరింత శోభ చేకూర్చనుందని చెప్పారు.

విజయవంతంగా స్కాలర్షిప్ టెస్ట్



సమావేశంలో రాజుకార్తికేయన్ తదితరులు

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'ఎట్-సన్‌రైజ్ గ్లోబల్ చెఫ్ అకాడమీ' ఆధ్వర్యంలో స్కాలర్షిప్ టెస్ట్ విజయవంతంగా ముగిసింది. ఈ వివరాలను అకాడమీ పూర్వ విద్యార్థి సెలబ్రిటీ చెఫ్ రాజుకార్తికేయన్ తదితరులు చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. అధిక సామర్థ్యంగల విద్యార్థులకు స్కాలర్షిప్‌లను పొందే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని, ఔత్సాహిక నిపుణుల కోసం ఎట్ సన్‌రైజ్ ప్రత్యేకమైన బోధనా విధానం అమలు చేస్తోందని, ప్రపంచ కెరీర్ మార్గాలను విద్యార్థుల ముందుంచుతుందన్నారు.

వైభవంగా ఆది కరుమారియమ్మన్ ఆలయ కుంభాభిషేకం



ఆలయ విమానంపై సంప్రోక్షణ జరుపుతున్న శివాచార్యులు

చెన్నై, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడులోని శివాలయం సమీపంలో ఉన్న ఆది కరుమారియమ్మన్ ఆలయ కుంభాభిషేక వేడుకలు గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. గురువారం ఉదయం నాలుగు కాల యాగపూజ, హోమం, దీపారాధన అనంతరం ఎనిమిదిగంటలకు వేద శివాగమ విద్యాభూషణం స్థానికర్ చంద్రశేఖర్ శివం నాయకత్వంలో శివాచార్యులు గోపుర కలశాలపై పవిత్ర నదీ జలాలను సంప్రోక్షించారు. ఆది కరుమారియమ్మన్, పరివారమూర్తులు వినాయకుడు, బాలమురుగన్, బాల శాస్తా సన్నిధులపై కూడా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



చేపాక్ కలైవానర్ అరంగంలో సెమ్మొళి దినం వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లోని పుస్తకాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థినులు




నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి - విజయదుర్గ

శ్రీవారి సేవలో మాజీ సీఎం నల్లారి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి సోదరి, నటుడు సాయిధరమ్‌తేజ్ తల్లి విజయదుర్గ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా దర్శనానికి ముందు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సుప్రభాత సేవలో విజయేంద్ర సరస్వతి



కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మఠం ఉత్తరాధికారి సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతితో కలిసి శ్రీవారి ఆలయంలో వేకువజాము జరిగిన సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం తర్వాత శ్రీవారి పుష్కరిణిని సందర్శించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.34 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,284
తలనీలాలు సమర్పించినవారు: 31,268



రేపటి నుంచి యూపీఎస్సీ ఇంజనీరింగ్ పరీక్షలు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలు(ప్రిలిమనరీ) ఆదివారం నుంచి నిర్వహించనుండడంతో డీఆర్వో నరసింహులు శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. నగరంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 791మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అందుకు తగినట్లు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పేపర్ 1 ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని, అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని అన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు.

తిరుపతిలో మత్తు ఇంజెక్షన్ల కలకలం

- ఆగమేఘాల మీద ఘటనా స్థలం పరిశీలన
- అంతా ఫేక్ అని తేల్చిన పోలీసులు



కూరాయల మార్కెట్‌లో వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం మత్తు ఇంజెక్షన్లు వున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలతో కలకలం రేగింది. దీనిపై ఎస్పీ హర్షవర్ధనరాజు సీరియస్‌గా స్పందించారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, ఎస్బీ సీఐ షాదిక్ ఆలీ, పోలీసులతో కలసి ఘటనా స్థలానికి వచ్చి చుట్టు పక్కల ప్రాంతాలు, మత్తు ఇంజెక్షన్లు వున్నట్లు వచ్చిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. దాదాపు 40 నిమిషాల పాటు అక్కడే ఉండి కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. ఎవరికైనా మత్తు ఇంజెక్షన్లు కనపడ్డాయా? ఎవరనా చూశారా అని అడిగారు. అయితే వైరల్ అయిన వీడియోను పరిశీలించిన ఎస్పీ అది ఇప్పటిది కాదని తేల్చారు. కానీ భవిష్యత్తులో కూరగాయల మార్కెట్‌లో నిషేధిత వస్తువులు, మత్తు ఇంజెక్షన్లు, మాదక ద్రవ్యాల ఉనికి కనపడకుండా ఉండడానికి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ పటిష్టమైన గస్తీ ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 112 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా అధికారులు ఆకాంక్షించారు. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకుని వారు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శన టోకెన్ల జారీ



దివ్యదర్శనం టోకెన్లు పొందుతున్న శ్రీవారి మెట్టు కాలిబాట భక్తులు

తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన వెళ్లే భక్తులకు శుక్రవారం సాయంత్రం నుంచి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శన(డీడీ) టోకెన్ల జారీని టీటీడీ ప్రారంభించింది. ఈసందర్భంగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారిమెట్టు దివ్యదర్శన టోకెన్ కేంద్రాన్ని శ్రీవారిమెట్టు నుంచి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చడంపై భక్తుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. శ్రీనివాస మంగాపురం ఆలయంలో కౌంటర్ల ఏర్పాటుకు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతున్న క్రమంలో భక్తుల సౌకర్యార్థం టోకెన్ కౌంటర్లను తాత్కాలికంగా భూదేవి కాంప్లెక్స్‌కు మార్చామన్నారు. భూదేవి కాంప్లెక్స్‌లో ఇప్పటికే పూర్తిస్థాయిలో ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్లు జారీ చేసే మౌలిక సదుపాయాలు ఉండటంతో డీడీ టోకెన్ల జారీని ప్రారంభించామన్నారు. శ్రీవారిమెట్టు డీడీ టోకెన్ల జారీ చేయడానికి నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, టీటీడీ ఏర్పాట్లపై భక్తులు కూడా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రవాణా వ్యవస్థ కూడా బాగా ఉందని, బస్టాండ్ కూడా అలిపిరిలోనే ఉందన్నారు. దీంతో భక్తులు శ్రీవారిమెట్టుకు చేరుకోవడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు శ్రీవారి సేవా వలంటీర్లతో పాటు పరిపాలన నిఘా, అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించామన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా డీడీ టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యదర్శన టోకెన్లను పరిశీలిస్తున్న అదనపు ఈవో

చెవిరెడ్డీ.. లిక్కర్ స్కామ్‌లో నీ పాత్ర ఏంటో

సిట్ దర్యాప్తులో తేలుతుంది

- వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేయడం నీ నైజం
- కక్ష సాధింపు కాదు.. మీ అవినీతిపై చట్టపరంగానే చర్యలు
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుపతి(జీవకోన), జూన్ 6(ఆంధ్రజ్యోతి): చెవిరెడ్డీ.. లిక్కర్ స్కామ్‌లో నీ పాత్ర ఏంటో సిట్ దర్యాప్తులో తేలుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. నీ గన్‌మేన్ గిరిని బెదిరించి తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వమన్నారంటూ హడావిడి చేయడం.. గుమ్మడికాయల దొంగ భుజాలు తడుముకున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. సానుభూతి, పబ్లిసిటీ కోసం ముందస్తుగానే ఇలాంటివి చేయడం సరికాదన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కసిరెడ్డితో స్నేహం లేకపోతే టీటీడీ బోర్డుకు ఆయన పేరు ఎందుకు సిఫార్సు చేశావంటూ ప్రశ్నించారు. 'నీపై 87కేసులు పెట్టారంటూ చెబుతున్నావు. అవన్నీ టీడీపీ ప్రభుత్వంలో కాదు.. కాంగ్రెస్ హయాంలో పెట్టినవే. వైసీపీ ప్రభుత్వంలో నాపై ఎన్నో కేసులు పెట్టారు. మేము తప్పు చేస్తే ఏ జైలుకైనా వెళ్లడానికి సిద్ధం. వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేసే నైజం నీది. ఈ ప్రభుత్వంలో ఎవరిపైనా కక్షసాధింపులు ఉండవు. మీ అవినీతికి సంబంధించిన ఆధారాలు చాలా ఉన్నాయి. అవన్నీ చట్టం చూసుకుంటుంది. ఇకనైనా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో. నువ్వు తప్పు చేయలేదంటే ఎవరూ నిన్ను టచ్ చేయరు. నువ్వెంత అవినీతి చేశారో అందరికీ తెలుసు. అరెస్టయితే సింపతీ వస్తుందని అనుకుంటున్నావేమో? అలాంటి పరిస్థితి ఉండదు' అని పులివర్తి నాని స్పష్టంచేశారు. బియ్యం మాఫియాలో మీ కుటుంబానికి ఎంత ముడుపులు చేరాయో త్వరలోనే బయటకు వస్తుందని చెవిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఎన్నికల సమయంలో కంటైనర్లలో డబ్బులు దొరికిన విషయాన్ని గుర్తు చేశారు.ఆ డబ్బులు తమవి కాదంటూ చెవిరెడ్డి బుకాయిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవద్దని, అవసరమైతే సలహాలు ఇవ్వాలని సూచించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాది కాలంలో తాను ఎన్నో అభివృద్ధి పనులు చేపడితే.. చేయలేదంటూ పత్రికల్లో రాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.80కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, గౌస్ బాషా, మురళి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మాఫియాలో నన్ను ఇరికించే కుట్ర

- తప్పుడు వాంగ్మూలం కోసం సిట్ ఒత్తిడి తెస్తోందన్న చెవిరెడ్డి



తిరుపతి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో తనను ఇరికించేందుకు కుట్ర చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాదులో నివాసమున్న తన ఆత్మీయుడు వెంకటేష్, ఆయన భార్య, ఏడాది వయసున్న కుమారుడిని సిట్ అధికారులు తమ కార్యాలయంలో బంధించి భయపెడుతున్నారని ఆరోపించారు. సిట్ తయారు చేసిన తప్పుడు స్టేట్‌మెంట్‌లో సంతకం పెట్టకుంటే ఏదో ఒక కేసులో ఇరికించి జీవితాంతం జైల్లో ఉండేలా చేస్తానంటూ వెంకటేష్‌ని ఏఎస్పీ శ్రీనివాస్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. అప్పటికీ ఆయన సంతకం పెట్టకపోవడంతో ప్రలోభపెడుతున్నట్టు ఆరోపించారు. వెంకటేష్ కుటుంబీకులతో పాటు ఆయనవద్ద పనిచేసే చిన్న చిన్న ఉద్యోగులనూ తీసుకెళ్లి హింసిస్తున్నారన్నారు.



గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు

వైభవం.. గోవిందుడి గరుడోత్సవం





తిరుమల ఆలయం నుంచి తీసుకొచ్చిన ఆభరణాలు - పల్లకి వాహనం

తిరుపతి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజైన శుక్రవారం రాత్రి గరుడసేవ జరిగింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన గరుడసేవ 10 గంటల వరకు కొనసాగింది. వజ్ర, వైఢూర్యాలు, విలువైన బంగారు ఆభరణాలు, సహస్రకాసుల హారాలు, నూతనంగా అందజేసిన నగలతో స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. గోవిందనామ స్మరణలతో అడుగడుగున భక్తజనం కర్పూర నీరాజనం సమర్పించారు. ఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులను మురిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. వాహన సేవల ముందు కోలాటాలు, చెక్కభజనలు, కేరళడ్రమ్స్, కళాబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గరుడసేవ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుంచి రూ.34.46లక్షల విలువచేసే మూడు బంగారు ఆభరణాలను కానుకగా అందించారు. దీర్ఘచతుర ప్రాకార పతకం, అమ్మవార్ల దీర్ఘచతుర ప్రాకార రెండు పతకాలను శాశ్వత ప్రాతిపదికన టీటీడీ బహూకరించింది. తిరుమల బేడిఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈ ఆభరణాలను ఊరేగింపుగా డిప్యూటీ ఈవో లోకనాథం తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.

హెచ్చరికా.. మాకేంటి?

- బోర్డు పీకేసి భూమిని కొట్టేసేందుకు భారీ స్కెచ్

'ఈ భూమి కొత్తపాలెం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు-99లో ఉంది. ఇది ప్రభుత్వ భూమి. ఇందులోకి ప్రవేశించుట నిషిద్ధం. అట్లు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- రేణిగుంట తహసీల్దారు పేరిట ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఇది. దీనిని పీకి పడేసి ఆక్రమణకు యత్నిస్తున్నారు.



పాత విమానాశ్రయం రోడ్డులో కబ్జాకు యత్నిస్తున్న భూమి




ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ నిర్మించేందుకు తోలిన రాయి - రెవెన్యూ హెచ్చరిక బోర్డును పడేసిన దృశ్యం

రేణిగుంట మండలం పాత విమానాశ్రయం ఆనుకొని ఆరు లేన్ల జాతీయ రహదారి రావడంతో రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కళ్లు పడింది. దీంతో కోట్ల విలువైన ఆ భూములను ఆక్రమించేందుకు రెండు వర్గాలు దిగాయి. ఒక వర్గం ఆ భూమి తమదంటే, కడప జిల్లాకు చెందిన మరో వర్గం తమదంటున్నాయి. తమకంటే తమకు డాక్యుమెంట్లు ఉన్నాయని చెబుతున్నారు. ఆలస్యంగా మేలుకున్న రెవెన్యూ అధికారులు సదరు భూమిలో హెచ్చరికలు బోర్డు పెట్టారు. అయితే కొత్తపాళేనికి చెందిన వ్యక్తి ఐదు ఎకరాల భూమిలో సాగు చేసుకుంటామని గతంలో అసిస్టెంట్ సెటిల్మెంట్ ఆఫీసర్ దగ్గర దరఖాస్తు చేసుకున్నారు. విమానాశ్రయం సమీపంలో ఉండడంతో దరఖాస్తును రద్దు చేశారు. దీంతో ఈ భూమిలో సాగు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్, ఆర్డీవో సహా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుమతులు ఇవ్వలేదు. ఈ భూమి వద్దకు రోజుకు ఒకరు వచ్చిపోతుండడంతో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా ప్రభుత్వ భూమిని శుభ్రం చేయడంతో మూడుసార్లు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అయితే మూడుసార్లూ దాన్ని తొలగించారన్నారు. ఇకపై ఎవరైనా భూమిలో ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

పారిశ్రామిక అవసరాలకు స్టాండ్‌రీచ్ ప్యానల్స్

- ఈ ప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ట్ పరిశ్రమ సీఈవో సంజాయ్ సింగానియా



రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న పరిశ్రమ సీఈవో సంజాయ్ సింగానియా తదితరులు

తడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక మౌలిక సదుపాయాలకు అవసరమయ్యే స్టాండ్‌రీచ్ ప్యానల్స్‌ను తయారు చేస్తున్నామని ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఎండీ, సీఈవో సంజాయ్ సింగానియా అన్నారు. తడ మండలం మాంబట్టు సెజ్‌లో సుమారు రూ.300 కోట్లతో ఏర్పాటు చేసిన ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ పరిశ్రమను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక ఫుడ్ ప్రాసెసింగ్ కోల్డ్ స్టోరేజ్ వంటి వాటికి అవసరమైన స్టాండ్‌రీచ్ ప్యానల్స్ పెరుగుతున్న డిమాండ్‌కు తమ పరిశ్రమ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. తమ పరిశ్రమ ద్వారా ఏడాదికి 8 లక్షల చదరపు మీటర్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉందని దానిని 13.10 లక్షల చదరపు మీటర్లకు చేర్చేలా తమ పరిశ్రమ పనిచేస్తుందన్నారు. దేశంలోనే పర్యావరణ హిత నిర్మాణ పరిష్కారాలకు తమ ఉత్పత్తులు ఎంతో మెరుగైనవని చెప్పారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రస్తుతం 730 మందికి.. మరి కొద్ది రోజుల్లోనే 900 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. 2023లో తమ పరిశ్రమ 1.51 లక్షల చదరపు అడుగుల నిర్మాణాన్ని 50 గంటల్లోనే పూర్తిచేసి గిన్నిస్ బుక్‌ఆఫ్ రికార్డు సాధించిందన్నారు. తమ పరిశ్రమకు కాలుష్యనియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చట్టాలకు అనుగుణంగా అన్ని అనుమతులతో అత్యంత నాణ్యతతో ప్యానల్స్‌ను ఉత్పత్తి చేస్తామని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ చైర్మన్ భజరంగ్‌బోత్ర, ఈడీ నిఖిల్ బోత్ర, పీఆర్వో ఆజామ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి ఐఐటీలో

జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు అవగాహన

ఏర్పేడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025లో అర్హత పొందిన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు క్యాంపస్‌లోని లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో ప్రారంభమవుతుంది. డైరెక్టర్, డీన్లు, విభాగాధిపతులతో అభ్యర్థులు ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కల్పించారు. తరువాత క్యాంపస్ విజిట్ ఉంటుంది. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, డబుల్ డిగ్రీలు, బ్రాంచ్ మార్పు విధానం, హాస్టల్ వసతి, వైద్య సౌకర్యాలు తదితరాలపై అవగాహన పొందవచ్చు. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌ద్వారా హాజరయ్యే అవకాశం ఉంది. వివరాలకు నెం. 0877-2503532లో సంప్రదించవచ్చు.